# ఎక్కుపెట్టిన హక్కుల విలుకాడు!

**"సర్! నేనెంతో** సంపాదించాను. అన్నీ కోల్పోయాను. అందర్నీ కోల్పోయాను. నాకీ జీవితమంటేనే విరక్తి కలుగుతోంది" అని ఒక కుర్రాడు వెళ్లి ఆవేదనగా చెబితే, ఆత్మీయంగా పలకరిస్తూనే బాలగోపాల్ వేసిన ప్రశ్న ఏమిటో తెలుసా? "ఎంతో సంపాదించావంటే సంపాదించగల శక్తి ఏదో నీ దగ్గర ఉందన్నమాటే కదా! అలాంటి శక్తి ఉన్నప్పుడు మళ్లీ సంపాదించుకోవచ్చు. అయినా కోల్పోయే దాన్ని ఎందుకు సంపాదిస్తావు?" దీనికి వెంటనే ఆయన పరిష్కారం కూడా చూపారు. "వస్తువు, కోరిక కోసం పాకులాటలో భాగంగా మనిషి ఎంతో ప్రయాణం చేస్తున్నాడు. అది దక్కక పోయినా, దక్కి కోల్పోయినా కుంగిపోతాడు. కానీ అదే ఆ పాకులాటను మానవ సేవలో అంతర్భాగంగా చూపిస్తే పోవడమన్నదే ఉండదు కదా! ఒకసారి ఆ సేవలోని ఆనందాన్ని ఆస్వాదించడం మొదలుపెడితే, అది హిమాలయాల్లో తపస్సు చేసి పొందిన ఆనందం కన్నా ఎక్కువగా ఉంటుంది" అని ఆయన హితబోధ చేశారు. మానవ సేవకు, మానవ హక్కులకు అంకితమై పోయిన బాలగోపాల్ జీవితమంతా దీన్నే ఆస్వాదించారు. అందుకే సమకాలికుల్లో ఎందరో పౌర హక్కుల కార్యకర్తలున్నా ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచారు. "తోటి మనిషికి సహాయ పడడమనేది మనిషిలో స్వతహాగా ఉండాల్సిన లక్షణం. అయితే అది లోపిస్తోంది. అందువల్లే ఈ సమస్యలు, హింసలు, ప్రతి హింసలు!" అని ఆయన నిర్వచించారు. అధ్యాపకుడు, మేధావి, మంచి వక్త, మార్క్సిస్టు విశ్లేషకుడు, గొప్ప న్యాయవాది, రచయిత... ఇలా ఎన్నో కోణాలున్నప్పటికీ బాలగోపాల్ మానవ హక్కుల ఉద్యమారుడిగానే చరిత్రలో ఎక్కువగా

నిలిచిపోతారు. ఎందుకంటే రాష్ట్రంలో మానవ హక్కుల ఉద్యమానికి ఆయన చేసిన సేవ అలాంటిది!

## మానవ హక్కుల్లో మేలి మలుపులు

అనేక కోణాల్లో మానవ హక్కుల ఉద్యమానికి బాలగోపాల్ ఆద్యుడిగా నిలిచారు. ఆయనకు ముందు రాష్ట్రంలో హక్కుల ఉద్యమానికి రాజకీయ అనుబంధాలే ఎక్కువ. హక్కుల ఉద్యమ వేదికలో వివిధ ఎంఎల్ పార్టీలకు కోటాలవారీగా పదవులు దక్కేవి. కొన్నిసార్లు హక్కుల ఉద్యమంతో సంబంధం లేనవారూ ఆ పదవుల్లోకి వచ్చేవారు. కానీ బాలగోపాల్ కృషి కారణంగా ఏ పార్టీకి చెందని స్వతంత్ర మేధావులు పౌర హక్కుల ఉద్యమంలోకి వచ్చారు. దీంతో ఉద్యమానికి ఒకరకమైన నిష్పాక్షికత, సార్వజనీనత చేకూరాయి. అంతేకాదు, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల ఉద్యమం దేశంలోనే శక్తిమంతమైనదిగా మారింది. దానికి ఒక నిబద్ధత అబ్బింది. ఈ క్రమంలోనే రాష్ట్ర మానవ హక్కుల ఉద్యమాన్ని, బాలగోపాల్ అఖిల భారత స్థాయికి చేర్చారు. రజనీ కొఠారి తదితరులను ఇక్కడికి తీసుకురావడమే కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల ఉల్లంఘనను జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. ఈ మేరకు కర్నాటక, నాగపూర్, ఢిల్లీలో సదస్సులు నిర్వహించారు. మానవ హక్కుల ఉద్యమంలో ఫుల్‌టైమర్ విధానాన్ని మొట్టమొదట తెచ్చింది కూడా ఆయనే! ఆయన స్వయంగా దీన్ని ఆచరించి చూపడంతో, ఆయన తర్వాత మరికొందరు అదే బాటలో నడిచారు. పబ్లిక్ హియరింగ్ (బహిరంగ విచారణ) అనే విధానాన్ని కూడా ఆయనే ప్రవేశపెట్టారు. "రిటైర్డ్ జడ్జీలను, ఇతర ప్రముఖుల్ని పిలిచి వివిధ సమస్యలపై జనామోదాన్ని తెలుసుకోవడం, నిష్పాక్షిక అంచనాకు రావడం అనే విధానాన్ని బాలగోపాలే ప్రవేశపెట్టారు. తర్వాతి కాలంలో ఇది ఎంతో ప్రజాదరణ పొందింది. ఇప్పుడు అనేక స్వచ్ఛంద సంస్థలు దీన్ని అనుసరిస్తున్నాయి" అని బాలగోపాల్‌తో దశాబ్దాల అనుబంధమున్న సుబ్రహ్మణ్యం వివరించారు. ఏపీసీఎల్సీకి రెండుసార్లు జాయింట్ సెక్రటరీగా పనిచేసిన సుబ్రహ్మణ్యానికి 15 ఏళ్ల పాటు బాలగోపాల్‌ను రోజూ కలిసిన సాన్నిహిత్యముంది. రాజ్య హింసతో పాటు, ప్రైవేటు హింసను కూడా మానవ హక్కుల ఉల్లంఘన కిందే లెక్కవేయాలన్న బాలగోపాల్ వాదన, కొన్ని వర్గాలకు ఆయన్ను దూరం చేసినప్పటికీ, మానవ హక్కుల ఉద్యమానికి మాత్రం ఆమోదనీయతను పెంచింది. పార్టీ రహిత

ప్రజా సంఘాన్ని ఈ స్థాయిలో నిర్మించడమంటే అది బాలగోపాల్‌కు మాత్రమే సాధ్యమైంది. నమ్మిన దాన్ని గట్టిగా ఆచరించడం, వ్యక్తిగతంగా విలువలకు పూర్తిగా కట్టుబడడం వల్ల బాలగోపాల్‌కు, ఆయన ఉద్యమానికి ఎంతో విశ్వసనీయత చేకూరింది. ఎంత అంటే చివరికి పోలీసులు కూడా ఆయన మాటను నమ్మేంత! ఎన్‌కౌంటర్ల వంటివి జరిగినపుడు మృతి చెందిన నక్సలైట్ల వద్ద డబ్బు లభించిన సందర్భాల్లో పోలీసులు ఒక లెక్క చెప్పేవారు. తర్వాత అదే ఎన్‌కౌంటర్‌పై బాలగోపాల్ బృందం నిజ నిర్ధారణ జరిపినపుడు, అందులో పోయిన సొమ్ము గురించి కూడా పేర్కొనేవారు. దీని ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులు..“మరణించిన నక్సల్ వద్ద చాలా సొమ్ము ఉన్నట్టు బాలగోపాల్ తన నివేదికలో చెప్పారు. మీరేమో తక్కువ చూపిస్తున్నారు ఎందుకు? మిగతాదీ పట్టుకురండి” అని అడిగిన సందర్భాలూ ఉన్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

## ఎవరినీ లెక్కచేయని సాహసి

“బాలగోపాల్ ఇంట్లో చాలా సరదాగా ఉండేవారు. జోకులు వేసేవారు. పాటలు పాడేవారు. కానీ ఇంట్లో ఉండే బాలగోపాల్ వేరు. బయట కనిపించే బాలగోపాల్ వేరు” అని వివరించారు హెచ్ఎం టీవీ సీఈవో రామచంద్రమూర్తి. “బయట ఆయన సీరియస్ మనిషి, కొంతవరకు అంతర్ముఖుడు కూడా. చాలా నిష్కర్షగా మాట్లాడేవారు. పౌర హక్కుల ఉద్యమకారుల్లో మిగిలిన ఎవరికీ లేని ధైర్యం ఆయన సొంతం. మాట అనాల్సిన పరిస్థితే వస్తే ఎదుట ఎవరున్నారన్నదాంతో సంబంధం లేకుండా, ఏమాత్రం సంకోచించకుండా అనగలిగేవారు. ఎదుటి వ్యక్తిది ఏ పొజిషన్ అన్నది చూడకుండా, బాణం లాగా, తూటా లాగా, కుండబద్దాలు కొట్టినట్టు మాట వదిలేవారు” అని అనేక ఏళ్లపాటు ఆయన్ను ఎంతో సన్నిహితంగా గమనించిన రామచంద్రమూర్తి వివరించారు. “ఆయన చాలా ధైర్యవంతుడు. ఆయన ధైర్యం నుంచే మేం స్ఫూర్తి పొందాం. అంత కల్లోలిత వాతావరణంలోనూ ఆయన హనుమకొండ సెంటర్‌లో ఒక ఇంట్లో కింద ఒక రూమ్‌లో ఒంటరిగా కిరాయికి ఉండేవారు. అది చూసి మాకే భయమయ్యేది” అని సుబ్రహ్మణ్యం వివరించారు. “అది కారంచేడు అయినా, జగిత్యాల అయినా, పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నా బాలగోపాల్ అక్కడ వాలిపోయేవారు. పోలీసులను నేరుగా నిలదీసేవారు” అని తెలిపారు.